విశాలాంధ్ర కృష్ణా జిల్లా

ధాన్యం బకాయిలు వెంటనే రైతుల ఖాతాకు జమ చేయాలి

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ ఏడాది జనవరి నుంచి రైతుల వద్ద ఆర్బికేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం బకాయిలను ప్రభుత్వం వెంటనే రైతు ఖాతాలలో జమచేయాలని కృష్ణా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దగాని సంగీతరావు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావులు డిమాండ్ చేశారు. సోమవారం కూచిపూడిలో విలేకరులతో మాట్లాడుతూ ధాన్యం సేకరించిన 20 రోజుల్లో రైతుఖాతాలో నగదు జమచేస్తామని ప్రకటించిన ప్రభుత్వం దాదాపు 50 రోజులు అవుతున్నా నగదు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రకృతి వైపరీత్యానికి గురై దెబ్బతిన్న రైతులు బయట అధికవడ్డీలకు అప్పులుతెచ్చి ఖరీఫ్‌లో వరి సాగుచేశారని, ఈ దశలో వరికుప్పలు నూర్చి బాకీలు చెల్లించాలనుకున్నా సన్న చిన్నకారు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు ప్రభుత్వం సకాలంలో నగదు జమ చేయకపోవడం వారిని మరింత కృంగదీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించి ధాన్యం బకాయిలను రైతు ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి సంబంధిత కార్యాలయాల వద్ద అధికారులను నిలదీసేందుకు సమాయత్తమవుతామని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలులో రైతుల అవస్థలు

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతుల నుంచి కొనుగోలు చేయు ధాన్యం విషయంలో పలు సమస్యలు తల ఎత్తటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమౌతోంది. దళారీల బెడద నుంచి రైతులను కాపాడాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం మిల్లర్లకు నేరుగా ఈ పని అప్పగించటంతో వారి దయాదాక్షిణ్యాల పై ఆధారపడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

పరుగు పందెంలలో 'ఎస్‌పీఎస్' విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుడివాడ : ఈనెల 12వ తేది ఆదివారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో జరిగిన పర్వతనేని జగన్మోహనరావు మెమోరియల్ 10కె, 6కె, 4కె రన్ ల పరుగు పందెంలో గుడివాడ ఎస్.పి.ఎస్. మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు 10కె బాలురు విభాగంలో ద్వితీయ స్థానం, 6కె లో బాలికల విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలను అలాగే 4కె బాలురు విభాగంలో మొదటి, తృతీయ స్థానం సాధించడమే కాకుండా మొత్తం అన్ని విభాగాలలో 45 బహుమతులు సాధించి ఈ పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలవడం జరిగింది. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి.ఎం.ఇ. రాణి మరియు పాఠశాల సిబ్బంది క్రీడాకారులను మరియు వ్యాయామ ఉపాధ్యాయులు మడకా ప్రసాద్‌ను అభినందించారు.

ఎంఆర్‌పీఎస్ నాయకుడు రాచేటి మురళి హౌస్ అరెస్ట్

విశాలాంధ్ర-గన్నవరం : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పిలుపు మేరకు జాతీయ రహదారుల దిగ్బంధనం సందర్భంగా గన్నవరం ఏరియా మాదిగ దండోరా నాయకులు రాచేటి మురళిని హౌస్ అరెస్ట్‌చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో పోరాటం చేసే హక్కు ప్రతి వ్యక్తికి ఉందని నివారించడం హేయమైన చర్య అన్నారు. హౌస్‌అరెస్ట్ చేసిన ఉద్యమాలు ఆగవన్ని హెచ్చరించారు. మురళి అరెస్టుకు సీపీఐ గన్నవరం కార్యవర్గ సభ్యులు కటవరపు విజయరావు సంఘీభావం తెలిపారు.

రాష్ట్ర ప్రజలకి శాపంగా మారిన ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే రావి

విశాలాంధ్ర-గుడివాడ : మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గుడివాడ ఎనిమిదో వార్డు పెద్ద వీధిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు దింట్యాల రాంబాబు, నాగరాజు, యార్లగడ్డ సుధారాణి, ఎం. సునీత, పోలాసి ఉమా, సర్కార్, రామినేని వేణు, బి. భవాని, రమేష్ చౌదరి, వార్డు టిడిపి నేతలు అర్నేపల్లి పాండు, ఏడుకొండలు పాల్గొన్నారు.

17 నుంచి సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర-నాగాయలంక : మండలంలోని సంగమేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 20 వరకూ జరుగుతాయని ఆలయ కార్య నిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయస్వామి సోమవారం చెప్పారు. 17న, అమ్మవారినీ అయ్యవార్లను వధూవరులను చేయుట, 18న, మహాశివరాత్రి సందర్భంగా స్వామి వారికి అభిషేకాలు, జగ జ్యోతి, దివ్యకళ్యాణ మహోత్సవం, 19న, రాత్రి ఏడుగంటలకు రథోత్సవం, 20న ఉదయం వసంతోత్సవం ఊరేగింపు, పవళింపు సేవ ఉంటాయని ఆయన తెలిపారు. రాత్రికి కళాకారులచే సంగీత విభావం సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శన ఉంటాయని సమ్మెట వెల్లడించారు. గత కొన్ని దశాబ్దాలుగా సంగమేశ్వరస్వామి వారి కళ్యాణ మహోత్సవాలు జరుగుతున్నాయని అన్నారు. దేవతలచే ఈ పురాతన ఆలయం నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయని ఆంజనేయులు వివరించారు.

నిబద్ధత గల కమ్యూనిస్టు కృష్ణయ్య

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు

విశాలాంధ్ర-చల్లపల్లి : నిబద్ధతగల కమ్యూనిస్టు హనుమానుల కృష్ణయ్య అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు హనుమానుల కృష్ణయ్య 12వ వర్ధంతి మండల పరిధిలోని వక్కలగడ్డలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాల కోసం అలుపెరుగని పోరాటం చేసారన్నారు. గ్రామస్థాయిలో కమ్యూనిస్టుపార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసారని కొనియాడారు. గ్రామభివృద్ధి కోసం కామ్రేడ్ మలుపెద్ది రామసుబ్బయ్య, రవణ వరపు వెంకటేశ్వరరావులతో కలిసి పనిచేసారన్నారు. నేటి తరం నాయకులు ఆయన చూపిన బాటలో నడవడమే కృష్ణయ్యకు ఇచ్చే నివాళి అని పేర్కొన్నారు. తొలుత కామ్రేడ్ హనుమానుల కృష్ణయ్య చిత్రపటానికి నాయకులు పూల మాలలు వేసి విప్లవ జోహార్లర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదరి మల్లుపెద్ది రత్నకుమారి, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి నక్క శ్రీనివాసరావు, పార్టీ

సీనియర్ నాయకులు మలుపెద్ది బోసు, అట్లూరి వెంకటేశ్వరరావు, హనుమానుల సాయిబాబు, ప్రజా నాట్యమండలి నాయకులు మల్లుపెద్ది రాజా, తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జగన్‌మోహన్‌రెడ్డి రక్తచరిత్రను ప్రజలకు తెలియజేసేందుకు పుస్తకాలను ఇంటింటికి పంపిణీ చేస్తామని, వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని, జగన్ పాలనకు రోజులు దెగ్గరపడ్డాయని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ ఆరోపించారు. సోమవారం అసెంబ్లీ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాబాయి వివేకానంద హత్యకేసులో పూర్తిగా జగన్మోహన్‌రెడ్డి కుటుంబపాత్ర ఉందని అన్నారు. జగన్ ఎన్ని అవినీతి బాగోతాలు, రాష్ట్రాన్ని విపరీతంగా దోచుకున్నాడని ఆరోపించారు. ఇది జగనాసుల రక్త చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని నేర చరిత్ర ఉన్న వాళ్ళని తరిమి కొట్టాలని వారు అన్నారు. వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్ని ఆర్థిక నేరాలు చేశావో నీ అంతరాత్మకే తెలుస్తుందని వారు వ్యక్తం చేశారు. నీ నీచ రాజకీయాలకు ప్రజల గమనిస్తున్నారని రానున్న రోజుల్లో వైఎస్ఆర్సిపి ని ఇంటికి పంపే సమయం ఆసన్నమైనదని వారు వెల్లడించారు. తొలుత జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కార్పొరేటర్లు సమత కీర్తి, చిత్తజల్లు రాము, అన్నం సతీష్ , పిప్పల కాంతారావు, కరెడ్ల సుశీల, బొడ్డు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన'లో ప్రజల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : కృష్ణాజిల్లాలో ఈ ఏడాది పదోతరగతి, మొదటి ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో సందేహాల నివృత్తికి మొబైల్ / వాట్సాప్ నెంబరు జిల్లా కలెక్టరు పి. రంజిత్ బాషా ప్రారంభించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో స్పందన అర్జీలు పరిష్కారానికి సంబంధించి గడువుదాటినవి 7 (%దీవఎశీఅం ూూాూ%), రీ ఓపెన్ 6 వచ్చాయని, వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. 2023 సంవత్సరంలో జరగబోవు ఎస్ఎస్సి, మొదటి ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరగు విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో ఎదురయ్యే సందేహాలను సబ్జెక్టు ఎక్స్పర్టచే నివృత్తి చేయించేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆన్ లైన్ ప్రొగ్రాం నూతనంగా ఏర్పాటు చేసిందన్నారు. డిజిటల్ అవేర్ నెస్, సేవింగ్స్, ప్లానింగ్ బడ్జెటింగ్ ముఖ్యాంశాలతో ఈ నెల 13 నుండి వారం రోజులపాటు జిల్లాలో అన్ని బ్యాంకుల్లో ఆర్ బిఐ ఫైనాన్షియల్ లిటరసీ వీక్ నిర్వహిస్తున్నట్లు కలెక్టరు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఎల్డిఎం సాయిరాం, అధికారులతో కలసి కలెక్టరు పోస్టరు విడుదల చేశారు. స్థానిక సంస్థల్లో జడ్పిటిసి, ఎంపిటిసి, వార్డు సభ్యుల వంటి ప్రజాప్రతినిధులు ఖాళీలు భర్తీకోసం ఓటర్ల జాబితాలు ప్రచురణ ప్రక్రియ వేగవంతం గావించాలన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన సంబంధించి డ్రాపవుట్స్ డేటా కూడా అప్లోడ్ చేయలన్నారు. గ్రామ సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ మరియు కృష్ణాజిల్లా కమిటీలు వేరువేరుగా ముద్రించిన 2023 క్యాలండర్ లను కలెక్టర్, జెసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ముడ విసి బి. శివనారాయణ, రెడ్డి, ఆర్డీఓ ఐ.కిషోర్, డిపిఓ నాగేశ్వరనాయక్, డిఎల్డీవో సుబ్బారావు, డిఇవో తాహెరా సుల్తానా, డిఎం అండ్ హెచ్ వో డా. గీతాబాయి, తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో స్పందనకు మూడు అర్జీలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు మూడు అర్జీలు వచ్చాయి. మొవ్వపాలెంలో నూతన పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి సర్పంచ్ సిహెచ్ శివకుమారి నిధులు కోరుతూ దరఖాస్తు దాఖలుజేశారు. అలాగే నిడుమోలు, కోసూరు గ్రామాలకుచెందిన భూ యజమానులు పట్టాదారు పాసు పుస్తకాలను కోరుతూ దరఖాస్తులు ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ నిర్వహించారు.

సీఎం జగన్ ప్రభుత్వంలో రైతులకు న్యాయం

విశాలాంధ్ర-మోపిదేవి : సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరుగుతుందని కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు మోపిదేవి బ్రాంచ్ నూతన భవన నిర్మాణానికి శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబుతో కలిసి తన్నీరు నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఏజీఎం నోడల్ అధికారి జి సూర్యప్రకాశరావు, బ్రాంచ్ మేనేజర్ నూకల త్రివిక్రమరావు ల ఆధ్వర్యంలో ఒక కోటి తొమ్మిది లక్షల 24 వేల రూపాయల నిధులతో అత్యాధునిక హంగులతో నిర్మించబోయే భవన నిర్మాణానికి సింహాద్రి, తన్నీరు లు శాస్త్రవేత్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు శిలాఫలకాన్ని సాంప్రదాయ బద్ధంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సి.ఇ.ఓ ఏ శ్యామ్ మనోహర్, జిల్లా డైరెక్టర్ గడిదేసి పెద వెంకయ్య, దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జడ్పిటిసి సభ్యులు మేడబలిమి మల్లికార్జునరావు, సర్పంచ్ నందిగం మేరీ రాణి, పిఏసిఎస్ చైర్ పర్సన్ రావి రాంప్రసాద్ లతోపాటు మండలంలోని సొసైటీల చైర్మన్లు, కార్యదర్శి లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియం కమిటీ బహుమతులు

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి ఎన్టీఆర్ స్టేడియం కమిటీ గుడివాడ వారి ఆధ్వర్యంలో 10 కే రన్, 6 కే రన్, 4కె రన్ లలో బాలికల విభాగంలో జరిగిన పోటీలలో మండలంలోని యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు 6కె రన్ లో జి. అనిత ద్వితీయ స్థానం పొంది 3,125 రూపాయలు నగదును, డి. సరిత శ్రీ తృతీయ స్థానం పొంది 2, 120 రూపాయలు నగదును 4కె రన్ లో ఎస్. సుప్రజ ఆరవ స్థానం పొంది 320 రూపాయలు నగదును, ఏ. విద్య శ్రీ ఏడవ స్థానం పొంది 220 రూపాయలు, డి. యోగిత ఎనిమిదవ స్థానం పొంది 220 రూపాయలు నగదును, స్టేడియం కమిటీ బహుమతులుగా అందించారు. అదే విధముగా 6 కే రన్ బాలుర విభాగంలో డి. దేవదానం, వి. మహిదర్ లకు ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ప్రశంసా పత్రాలు అందించారు. వివిధ రంగాలలో గెలుపొందిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు పీఎస్. సోమేశ్వరావును ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావెళ్ల వరుణ కుమార్, ఉపాధ్యాయులు పి. సత్యానందం, ఎస్. కరుణ కుమార్, పి. అంబేద్కర్, వి. సాంబశివరావు లు సోమవారం ఆ పాఠశాల ఆవరణలో అభినందించారు.

రైతు శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యం : సింహాద్రి

విశాలాంధ్ర-చల్లపల్లి : రైతు శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్య మని స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు పేర్కొన్నారు. చల్లపల్లి మండలం వక్కలగడ్డలో పీఏసీఎస్ కు అనుసంధానంగా 500ల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తుల గోదాము నిర్మాణానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావులు సోమవారం శంకుస్థాపన చేశారు. వక్కలగడ్డ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ నిధులు 10శాతం, నాబార్డు నిధులు 90 శాతం కలిపి రూ.40లక్షల అంచనా వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల గోదాము మరియు మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్ నిర్మాణం చేపట్టనున్నారు. ఎమ్మెల్యే, చైర్మన్ లు శంఖుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుతం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు అనువైన చేతి సంచులు ఆవిష్కరించి రైతులకు పంచిపెట్టారు. సొసైటీ ఛైర్ పర్సన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ ఏ.శ్యామ్ మనోహర్, బ్యాంక్ డైరెక్టర్ జీ. పెద వెంకయ్య, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, ఏఎంసీ ఛైర్మన్లు వేమూరి వెంకట్రావు, కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు మోతుకూరి ఏడుకొండలు, అబ్దుల్ అర్షద్, చినకళ్లేపల్లి సర్పంచ్ గుత్తికొండ రాము, కేడీసీసీ బ్యాంక్ చల్లపల్లి మేనేజర్ నగరాజకుమారి, సొసైటీ చైర్మన్లు పాగోలు నాగ సీతారామారావు, అరజా శివశంకర్, పాల కేంద్రం అధ్యక్షులు మల్లుపెద్ది బోసు, సొసైటీ సీఈఓలు, బ్యాంకు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

విశాలాంధ్ర-గుడివాడ : ఈనెల 14వ తేది మంగళవారం ఉదయం 11.30 గంటల నుండి 12.30 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలను డయల్ యువర్ డీఎం కార్యక్రమం ద్వారా నెం: 9959225464కు ఫోన్ చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేష్ విజ్ఞప్తి చేశారు.

మున్సిపల్ కమిషనర్ వార్డు పర్యటన

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని సత్యనారాయణపురంలోని మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఫిర్యాదు అందడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ సంబంధిత ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బందితో కలిసి 23వ వార్డు సత్యనారాయణపురంలో సందర్శించారు. ఈ విషయమై కమిషనర్ మురుగు నీరు రోడ్లమీద నిలవకుండ, దోమల బెడద లేకుండా మరియు దుర్గంధం రాకుండా ఉండేలాగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. అదేవిధంగా చింతల కాలవ మురుగు కాల్వకు అనుసంధానంగా ఉండే ప్రధాన డ్రైన్ పూడిక తీయుటకు అంచనాలు సిద్ధం చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సంబంధిత వార్డు ప్రజలు కూరాళ్ళ హేమాంబరావు, జిల్లా రఘుబాబు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు Cholamandalam Investment and Finance Company Limited, Vijayawada వారి సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా.

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కొసరాజు హేమకృష్ణ గారి భార్య కొసరాజు రమాదేవి గారు ది.07.08.2021న శ్రీ కంకిపాడు సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసులో దస్తావేజు నెం. 42 35/2021రుగా రిజిష్టర్డు కాబడిన విక్రయ దస్తావేజు రీత్యా క్రయము పొంది తదాది సదరాస్తిని సర్వ సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచున్నారని తెలుపుచున్నారు మరియు షెడ్యూలు ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజులు అయిన శ్రీ కంకిపాడు సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసులో రిజిష్టర్డు కాబడిన ద.నెం.9942/2014, 5290/2013, 833/2012లు పోయినవని తెలుపుచున్నారు.

కాగా కొసరాజు రమాదేవి గారి వద్ద నుండి ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని క్రయము పొందుటకు పెద్దపోలు నాగ దుర్గమల్లేశ్వరి గారు క్రయము ఖరారు చేసుకొనియున్నారు. సదరు ఆస్తిని కొనుగోలు చేయుటకు ఋణసదుపాయము పొందుటకు, సదరాస్తిని కొనుగోలు చేసిన దరిమిలా సదరాస్తిని బ్యాంక్ వారికి తనఖా చేయుటకు Cholamandalam Investment and Finance Company Limited, Vijayawada వారికి అభ్యర్ధన చేసియున్నారు.

కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై గాని, సదరు దస్తావేజు నెం. 9942/2014, 5290/2013, 833/2012లుగా రిజిష్టర్డ్ కాబడిన ఒరిజినల్ లింకు దస్తావేజులు పై గాని, ఎవరికైననూ ఏవిధమైన హక్కులు గాని, చట్టరీత్యా చెల్లదగు క్లయములు గాని, మరి ఏవిధమైన అభ్యంతరములు గాని, ఉన్న యెడల, వారు ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల లోపుగా లిఖితపూర్వక ఆధారములతో తెలియ పరచగలరు. సదరు గడువు తేదీలోగా చట్ట ప్రకారము చెల్లదగు ఎటువంటి అభ్యంతరములుగాని రాని యెడల, మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని హామీగా స్వీకరించి ఋణ సదుపాయము కలుగజేయుదురు. ఆ దర్మిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు గానీ, క్లయములుగానీ, నా క్లయిం ట్లును గాని, షెడ్యూలు ఆస్తిని గాని బైండు చేయజాలవని, మా క్లయింటు షెడ్యూలు ఆస్తిపై పొందు హామీ మరియు తనఖా హక్కులను భంగము చేయజాలవనియూ, ఇందుమూలముగా తెలియచేయటమైనది.

షెడ్యూలు : కృష్ణాజిల్లా, కంకిపాడు సబ్ రిజిష్ట్రారు వారి యిలాకా, కంకిపాడు మండలం, ప్రొద్దుటూరు గ్రామ పంచాయితీ ఏరియా లో చేరిన, ప్రొద్దుటూరు గ్రామ రీ. సర్వే. నెం.60/6రు దాఖలా చ.గ.512.08లు నివేశన స్థలములో నిర్మించబడిన శ్రీ సాయి నిలయం నందలి గ్రౌండ్ ఫ్లోరు లోని ఫ్లాటు నెం.101రు దాఖలా అనిర్దిష్టపు జాయింటు హక్కునకు రాగల చ.గ.36.58 లు ఆస్తి. ఏ-షెడ్యూలు: తూర్పు : మీ. 18ల్లు వెడల్పు గల రోడ్డు దక్షిణం : ఫ్లాటు నెం. 100రులో మిగిలిన ఆస్తి పడమర : పాలడుగు గీత వగైరా వారల ఆస్తి ఉత్తరం : ఫ్లాటు నెం. 99రులో మిగిలిన ఆస్తి బి-షెడ్యూలు: తూర్పు : లిఫ్ట మరియు పార్కింగ్ ఏరియా దక్షిణం : ఫ్లాటు నెం. 100 రులో మిగిలిన ఆస్తి పడమర : పాలడుగు గీత వగైరా వారల ఆస్తి ఉత్తరం : మెట్లు మరియు కామన్ స్పేస్

ఆర్.కృష్ణ, అడ్వకేట్
D.No:30-22-69 ఏలూరు రోడ్డు,
విజయవాడ-520002. ఫోన్ నెం: 9885942416.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-గుడివాడ : నేషనల్ ఉమెన్స్ డే సందర్భంగా సోమవారం తారక రామా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బైపాస్ రోడ్ లోని సంజీవని హాస్పిటల్ డా॥ కె శ్రావణి ని సన్మానం చేశారు. ముందుగా సరోజినిదేవి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సయ్యద్ మహబూబ్ అలీ, కార్యదర్శి బలరాం, కోశాధికారి దాసరి సురేష్, దండమూడి సీతారామయ్య, గంగాధర్, సాయి సుబ్రహ్మణ్యం ఇతరులు ఇర్ఫాన్ భాష, నూరు, సుహాసిని తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుడివాడ పంచాయితీ డివిజనల్ ఆఫీసర్ జి. సంపత్ కుమారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు అర్జా ప్రసాద్, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజి, మెరుగుమాల శివరామకృష్ణయ్య, బొప్పన కుటుంబరావు, రూప్‌చంద్ జైన్, జ్ఞాన్ చంద్ జైన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వరరావు, పాఠశాల ఎన్‌సిసి ఆఫీసర్ కె. అనురాధ, ముఖ్య అధికారి మడకా ప్రసాద్ మరియు రెడ్ క్రాస్ సభ్యులు పి. శివపావని, పి. సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

హత్యలో సూత్రధారులను న్యాయస్థానం ముందు నిలబెట్టాలి : రావి

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక టీడీపీ ఆఫీస్ నందు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు తదితరులతో కలిసి సోమవారం తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన జగనాసుర రక్త చరిత్ర పేరుతో పుస్తకాన్ని, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రావి వెంకటేశ్వరరావుతో పాటు దింట్యాల రాంబాబులు లు మాట్లాడుతూ వై.ఎస్ వివేకాను అతి క్రూరంగా హత్య చేసిన తీరు, అనుమానానికి ఆస్కారం ఇస్తున్న సంఘటనలు ఈ క్రమంలో తాజాగా చోటు చేసుకుంటున్న సంఘటనలు, పరిణామాలు అన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే అనుమానాలు రేకెత్తించేవిధంగా ఉన్నాయన్నారు. కనుక సీబీఐ రాజకీయ ఒత్తిళ్లకు గురికాకుండా హత్యలో సూత్రధారులైన బడా నేతల్ని న్యాయస్థానం ముందు నిలబెట్టాలి. ఈ సమావేశంలో డా॥ గోర్జి సత్యనారాయణ, పోలాసి ఉమా, షేక్ సర్కార్, నాగరాజు, యార్లగడ్డ సుధారాణి, పి. సాంబశివరావు, గోవాడ శివ, ఎమ్. రమేష్ చౌదరి, ఏ. నీలాంబరం, ఎం. సునీత, సిహెచ్. దేవేంద్రుడు, కె. గోపాలకృష్ణ, పి. వీరభద్రరావు, కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం నాశనం

ముఖ్యమంత్రికి జిందాల్ సంస్థతో ఉన్న ఒప్పందం చెప్పాలి : నాదెండ్ల

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఏపీలో పెట్టుబడుల గురించి చెప్పాల్సిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి.. కోడిపెట్టలు, కోడిగుడ్లు గురించి మాట్లాడుతున్నారని జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఎద్దేవా చేశారు. జనసేన 3వ విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం గాంధీనగర్‌లోని రామాఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాతో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. ముఖ్యమంత్రికి జిందాల్ సంస్థతో ఉన్న ఒప్పందం ఏంటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్మోహనరెడ్డి ప్రభుత్వం భయంకరమైన పాలనను, తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించిందని ఆరోపించారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు వస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గ భేటీలో కడప స్టీల్ ప్లాంట్ ప్రస్తావన ఎందుకు లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రామాయంపట్నం పోర్టులో జిందాల్ సంస్థకి రెండు కమర్షియల్ బెర్తులు ఇస్తున్నట్టు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. రామాయంపట్నం, కావలిలలో ఆ సంస్థకు ఎందుకు భూములు కేటాయించారు దీని వెనక ఉన్న రహస్యం వెల్లడించాలన్నారు. ఈ ప్రభుత్వం అమరావతిని చంపేసిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే విజయవాడ కమర్షియల్ క్యాపిటల్‌గా ఉందన్నారు. రూ.500లతో క్రియాశీలక నమోదు తీసుకోవటం అంటే మీ కుటుంబానికి భద్రత తీసుకుంటున్నట్టు అవుతుందన్నారు. నగరంలో, సిఎం ఇంటి చుట్టూ గంజాయి విచ్చలవిడిగా లభ్యం అవుతుందన్నారు. టిట్కో ఇళ్లపై త్వరలో బందర్ రోడ్‌ను స్తంభింప చేసే కార్యక్రమం చేపడతామన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించటానికి జనసెన సిద్ధం అయ్యింది అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మిశెట్టి వాసు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను దోచేస్తున్న మిల్లర్లు : అరుమల్ల

విశాలాంధ్ర-గన్నవరం : తరుగు పేరుతో ఎకరానికి రూ.2,800 మిల్లర్లు దోచేస్తున్నారని ఉంగుటూరు టీడీపీ అధ్యక్షులు అరుమల్ల కృష్ణరెడ్డి విమర్శించారు. ఉంగుటూరు మండలం లంకపల్లిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు డా ఆరుమాళ్ళ వెంకట కృష్ణా రెడ్డి అధ్యక్షతన కార్యకర్తలు, అభిమానులు, అన్ని కమిటీలకు చెందిన సభ్యుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు డా ఆరుమాళ్ళ వెంకట కృష్ణా రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో రైతులు దగా పడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 5 నుంచి 10 కిలోల మేర వడ్లను తరుగు పేరుతో అదనంగా రైతుల నుంచి దండుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బియల్ మాయ రమేష్, జె వాసు, జల్లెడ శ్రీమన్నారాయణ, వల్లభనేని రంగారావు, ఆర్ కనకరవు, మంగరావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

విశాలాంధ్ర- కంచికచర్ల: పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ రహదారి దిగ్బంధం చేశారు. కంచికచర్ల మండలం కీసర టోల్గేట్ సమీపంలో రహదారి దిగ్బంధం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని కంచికచర్ల పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా పోలీసులకి కార్యకర్తలకి మధ్య తోపులాట జరిగింది. పలువురు ఎంఆర్పిఎస్ కార్యకర్తలకు నాయకులకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ విశ్వనాథం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని దుయ్యబట్టారు. ఎస్ సి వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టకపోతే కేంద్రంలో బిజెపి ప్రభుత్వంను రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామన్నారు. ఈ వర్గీకరణ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు తెలపాలని కోరుతూ రహదారి దిగ్బంధం కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహిళా సమాఖ్య నాయకురాలు జ్యోతి, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, గుండాల ఈశ్వరయ్య, శివ నారాయణ, కత్తి ఓబులేసు, గజ్జల బాలయ్య, మారన్న తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: రానున్న వేసవికాలం దృష్ట్యా పట్టణంలో అన్ని వార్డులలో తాగునీటిఎద్దడి లేకుండా ముందస్తుగా యుద్ధప్రాతిపదికన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వవిప్ జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అధికారులకు సూచించారు. పట్టణంలోని డాంగే నగర్ వాటర్ ట్యాంకు వద్ద పైప్‌లైన్ పున:నిర్మాణ పనులకు ఉదయభాను సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో తాగునీరు సరఫరా సరిగా లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానికులు తమ దృష్టికి తీసుకు వచ్చారని అన్నారు. ముఖ్యంగా డాంగేనగర్‌లోని వాటర్ ట్యాంకు వద్ద మోటార్‌లు సరిగా పనిచేయకపోవడంతో ట్యాంక్ పైకి నీరు ఎక్కడం లేదని తమ దృష్టికి తీసుకురావడంతో కొత్తగా పైపులైన్ వాల్వును ఏర్పాటు చేసి ప్రారంభించారని అన్నారు. పట్టణంలో ఎక్కడ కూడా నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సమస్యలు ఏదైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకుని వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, హాఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్, కౌన్సిలర్లు కొలగాని రాము,వట్టెం మనోహర్, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పింగళి నరసింహారెడ్డి, నాయకులు పూసల పుల్లారావు దువ్వల రామకృష్ణ,మోరే బాబీ,కటగాని నరసింహారావు, చిరంజీవి, మున్సిపల్ ఏ ఈ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సంగతి ఏమిటి?

కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర-విజయవాడ : భవన నిర్మాణ కార్మికులకు 1996 చట్టం ద్వారా రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 13 రకాల సౌకర్యాలను ఇచ్చేవారని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఈ బోర్డును మూసివేసి అన్ని క్లైములు ఆపేసి వేల కోట్ల రూపాయలు కార్మికుల సొమ్మును ప్రభుత్వం వాడుకోవడం దుర్మార్గమని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బయ్య తెలిపారు. విజయవాడ హనుమాన్ పేటలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర విడిపోయినప్పటి నుండి సంక్షేమ బోర్డుకు వచ్చిన డబ్బులు ఎంత అని అడిగితే సమాధానం చెప్పడం లేదు. ప్రస్తుతానికి రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సొమ్ము 902. 2 కోట్లు బోర్డులో ఉన్నదని ఇటీవల సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవటం జరిగిందన్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లోఉన్న 33,865 మందికి క్లైములు పరిష్కరించాల్సి ఉందన్నారు. ఇంత డబ్బులు కూడా ఈ క్లైములు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి వన్ పర్సెంట్ సెస్ ద్వారా 1569.29 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వసూలు చేసిందన్నారు. ఈ డబ్బులు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని కోరారు. అడిగితే అంటే ప్రభుత్వ బ్యాంకుల్లో ఉన్నాయని మాత్రమే సమాధానం చెపుతున్నారన్నారు. ఇంత డబ్బులు పెట్టుకొని కార్మికుల పొట్ట ఎందుకు కొడుతున్నారని ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. ఇంత దుర్మార్గమైన ప్రభుత్వంపై భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు సొమ్ము కాజేయాడమే కాకుండా ఇతర అంశాలు కూడా ప్రభుత్వం తీవ్రంగా నష్టం కలిగించిందన్నారు. ఇసుక, సిమెంట్ ధరలు పెంచడం, స్టీల్ ధరలు పెంచడం అన్ని విధాలుగా కార్మికులను నష్టపరిచిందన్నారు. ఈ ప్రభుత్వం ఒక్క క్షణం కూడా అధికారంలో ఉండదానికి వీలు లేదన్నారు. భవన నిర్మాణ కార్మికులకు నష్టం కలగజేసిన ప్రభుత్వం స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తిరిగి ఎన్నికల్లో ఇంత దుర్మార్గమైన వైఖరి అవలంభించే ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో చల్ల వెంకటరమణ,రామస్వామి,జగు శీను తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో, జగనన్న ఇళ్లు సాధించే వరకు పోరాటం

సీపీఐ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : టిడ్కో ఇళ్లు, జగనన్న ఇళ్లు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు అన్నారు. 14వ డివిజన్ పటమట లంకలోని లంబాడి పేటలో సోమవారం ఇంటింటికి తిరుగుతూ టిడ్కో, జగనన్న ఇళ్ల లబ్ధిదారులను కలిసి అర్జీలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఇల్లు లేని నిరుపేదలు, మధ్యతరగతి వారు టిడ్కో ఇళ్ల కోసం డిపాజిట్లు కట్టిన లబ్ధిదారులందరికీ తక్షణమే ఇల్లు కేటాయించాలని, ఎన్నికల హామీల్లో భాగంగా జగన్మోహన్‌రెడ్డి ఒక్క రూపాయికి టిడ్కో ఇళ్లను రిజిస్ట్రేషన్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఫిబ్రవరి 22న విజయవాడలో టిడ్కో ఇళ్ల సాధన కోసం జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు దోనేపూడి సూరిబాబు, 9, 14 డివిజన్ల సీపీఐ కార్యదర్శులు లంక ప్రసాదు, నడకుదుటి అంకరాజు, నాయకులు చవాకుల సాయిరాం, పొనమల యేసు, శ్రీ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

సాధన చేస్తే ఏదైనా సాధ్యమే

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు

విశాలాంధ్ర-విజయవాడ : సాధన చేస్తే ఏదైనా సాధ్యమే అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు లంకా గోవింద రాజులు అన్నారు. జైహింద్ అకాడమీలో సోమవారం ఎస్ఐ అభ్యర్థులకు నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పోటీ పరీక్ష అయిన నమూనా పరీక్ష రాయడంలో మెళకువలు తెలుసుకొని సమయం వృధా కాకుండా దైర్యంగా రాయగలుగుతారని చెప్పారు. నమూనా పరీక్షలు రాయకపోవడంతో అభ్యర్థులు తప్పులు చేస్తున్నారని ఓఎంఆర్ షీట్‌లో, బబ్లింగ్ చేయటంలో తప్పులు చేయటం సమాధానాలు తెలిసి సమయం వృధా కావడంతో మార్కులు పోగుట్టుకుంటున్నారని ఇలాంటి వాటిని అధిగమించేందుకు నమూనా పరీక్షలు రాయటం మేలన్నారు. సాధనతో అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చని పట్టుదల సాధన ఉంటే విజయం సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జైహింద్ అకాడమీ డైరెక్టర్ చక్రవర్తి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సాయికుమార్, అయ్యప్ప, నాని తదితరులు పాల్గొన్నారు.

రేపు కచ్చపీ అఖండ మహోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఎటువంటి వర్గ భేదాలకు తావులేకుండా శాస్త్రీయ సంగీతమే పరిరక్షణగా,శాస్త్రీయ సంగీత వ్యాప్తే లక్ష్యంగా ఆవిర్భవించి,ఉన్నతశ్రేణి సంగీత విద్వాంసుల సంగీత సభలు ఏర్పాటు చేస్తూ వర్ధమానులకు వేదికలు కల్పిస్తూ కుల మతాలకతీతంగా సంగీత సేవలను చేస్తున్న శ్రీ సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీ బుధవారం వార్షిక సప్తమ కచ్చపి అఖండ మహోత్సవం జరుగుతుందని సమితి కార్యదర్శి సివి రావు తెలిపారు. 12 గంటల పాటు జరిగే ఈ మహోత్సవం ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలోని కళావేదికపై ఉదయం 8 గంటలకు ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు నిర్విరామంగా జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలోని దాదాపు 60 మంది వైణిక విద్వాంసులు ఈ మహోత్సవంలో పాల్గొని వారికి కేటాయించిన సమయంలో వీణా వాదనం చేస్తారని తెలిపారు.

పెరియార్ ఆలోచనల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర-విజయవాడ : హేతువాదాన్ని, నాస్తిక వాదాన్ని రాజకీయాలకతీతంగా ముందుకు తీసుకెళ్లి భారతదేశాన్ని కొత్తగా నిర్మించాలని కృషి చేసిన పెరియార్ రామస్వామి ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ వారు ప్రచురించిన 'పెరియార్ రీడర్' పుస్తకావిష్కరణ సభలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న 33వ విజయవాడ పుస్తక మహోత్సవంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. డీబీఎఫ్ వ్యవస్థాపకులు కొరివి వినయ్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నేడు భారతదేశంలో ఆర్యులు, ద్రవిడులు అంటూ ఎవరూ లేరనే కొత్త ప్రచారం జరుగుతుందన్నారు. అది ప్రభుత్వ సంస్థల ప్రోద్బలంతో జరుగుతుందని చెప్పారు. శాసన మండలి సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయాల్లో నుంచే ప్రశ్నలు వస్తే వాటికి సమాధానం కనుగొనటం ద్వారా సమాజాన్ని సంస్కరించాలని పెరియార్ కృషి చేశారని చెప్పారు. వాస్తవాల్ని విస్మరించటం దేశానికి శ్రేయోస్కరం కాదన్నారు. సామాజిక న్యాయం కోసం ద్రవిడ సిద్ధాంతం కోసం పెరియార్ పని చేశారని చెప్పారు. కవి విల్సన్ మాట్లాడుతూ తమిళనాడులో ప్రత్యామ్నా సంస్కృతిని పెరియార్ నిర్మించారని చెప్పారు. నేడు ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ట్రస్ట్ నిర్వాహకులు గీతా రామస్వామి, రచయితలు బండారు సురేష్, దేవరపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అనువాద సాహిత్యంపై సదస్సు జరిగింది. ఆంధ్రా ఆర్ట్స్ అకాడమి అధ్యక్షులు గోళ్ల నారాయణ రావు అధ్యక్షతన ఈ సభ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అనువాద పురస్కార గ్రహీత వెన్న వల్లభరావు మాట్లాడుతూ అనువాద సాహిత్యం ప్రతిఒక్కరికి అందుబాటులోకి రావాలంటే అనువాద అకాడమిని స్థాపించాలని సూచించారు. అర్హత గలిగిన రచనలను నిష్పపాతంగా చేయాలన్నారు. అప్పుడే సాహజత్య ఔనత్యాన్ని పెంచినవాళ్లం అవుతాం అన్నారు. వాడ్రేవు చినవీరభద్రుడు మాట్లాడుతూ సాహిత్యంలో అనువాదంలో రెండు అంశాలు ఉంటాయి. ఒకటి సాహిత్య అనువాదం, రెండు శాస్త్ర సాంకేతిక అనువాదం ఉంటాయన్నారు. అనువాదంలో మూలాల్లో ఉన్న వాటిని యదార్థంగా ప్రచురించాలన్నారు.

పుస్తక మహోత్సవంలో నేటి కార్యక్రమం:

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించిన డాక్టర్ దేవరాజు మహారాజు రాసిన 'దేశంలో గౌరవనీయులైన మూర్ఖులు', ముక్తవరం పార్థసారథి రాసిన 'నవలోకం-4' పుస్తకాల ఆవిష్కరణ జరుగుతుంది. నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు సి.నరసింహారావు, భీమవరం ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు ఉపన్యాసాలు ఉంటాయి. ఈ కార్యక్రమానికి విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు గద్దం కోటేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు.

60వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడులోని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 60వ రోజు రిలే నిరాహార దీక్షలో వీరులపాడు గ్రామస్తులు అద్దంకి ప్రసాద్,అద్దంకి సీతారాములు,ప్రతిపాటి వెంకయ్య,తురక కోటేశ్వరావు,అద్దంకి లక్ష్మయ్య సోమవారం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రం తరలింపు నిర్ణయం ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు న్యాయ పోరాడానికైనా సిద్ధం అని తెలిపారు.

స్పందనకు 5 దరఖాస్తులు

విశాలాంధ్ర-గంపలగూడెం : తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో ఎర్రమల పిచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 5 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ జిట్టా బాలకృష్ణరెడ్డి తెలిపారు. అధికారులు పాల్గొన్నారు.

తెలుగు జాతికి పొట్టి శ్రీరాములు సేవలు ఎనలేనివి

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: పట్టణంలోని జమ్మిచెట్టు సెంటర్‌లో ఎగుమతి దిగుమతి వర్తక సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మాజీ మంత్రి నెట్టం శ్రీరఘురామ్, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)లు ముఖ్య అతిదిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతికి చేసిన సేవలు చిరస్మరణీయం అని అన్నారు. తెలుగు జాతి ఔనత్యం కోసం అహర్నిశలు ఆయన చేసిన కృషి మరువలేనిదని అన్నారు. సుమారు 60 ఏళ్లకుపైగా ఉన్న ఈ విగ్రహాన్ని ఆధునీకరించి పునఃప్రతిష్టించుకున్నట్లు తెలిపారు. త్వరలో ఈ వీధిని పొట్టి శ్రీరాములు వీధిగా నామకరణం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ కౌన్సిలర్ నూకల సాంబ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మానేపల్లి నాగబ్రహ్మం, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవానీప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షులు చారుగుండ్ల కొండ, ఎస్టీ విభాగం అధ్యక్షుడు బద్దు నాయక్, కార్మిక విభాగం అధ్యక్షులు గోగుల వెంకయ్య నాయకులు చోడవరపు జగదీష్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర, కొత్త పురుషోత్తం, తుమ్మెపల్లి గోపాల్, వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్య వంతులు కావాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : క్రమం తప్పక మందులు వాడడంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్య వంతులు కావాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇండియన్ మెడిక్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయంలో 200 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు, కలెక్టర్ సోమవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా నిక్షయ మిత్ర కార్యక్రమంలో 200 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ద్వారా పోషకాహార కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా 2వేల మందికిపైగా క్షయ వ్యాధితో బాధపడుతున్న బాధితులున్నారని, వారందరికి పౌష్టికాహార కిట్లను అందించి, రోగ నిరోధక శక్తిని పెంచే విధంగా 6 నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి రోగనిరోధక శక్తి తగ్గకుండా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. క్రమం తప్పక మందులను వాడడం ద్వారా క్షయ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమకూర్చిన 16 డిజిటల్ హిమోగ్లోబిన్ ఎనలైజర్లను వార్డు హెల్త్ సెక్రటరీలకు కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జీ.సమరం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని డాక్టర్ ఎం.సుహాసిని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రెహమాన్, కార్యదర్శి డాక్టర్ మనోజ్, జిల్లా టీబీ కంట్రోలింగ్ అధికారి డాక్టర్ ఉషారాణి పాల్గొన్నారు.

బ్యాంక్ లావాదేవీలపై అవగాహన ఉండాలి

బ్యాంకుల ద్వారా అందిస్తున్న ఆర్థిక లావాదేవీల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహించే (ఫైనాన్స్ లిటరసీ) ఆర్థిక పరమైన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా అవగాహన పోస్టర్లను స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. 2016 సంవత్సరం నుండి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం వారం రోజుల పాటు సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ-మంచి లక్షణం అనే నేపథ్యంలో భాగంగా ఆర్థిక పరమైన లావాదేవీల(ఫైనాన్స్ లిటరసీ)పై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రైవేట్ బ్యాంకుల వల్ల కలిగే నష్టాలు, ప్రభుత్వం గుర్తించిన బ్యాంకుల ద్వారా దస్తావేజులు అవసరం లేని విధంగా రుణాలను పొందేందుకు సులభతర డిజిటల్ విధానంపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో కే.మోహన్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాస్, ఎల్‌డీఎం పీ.కోటేశ్వరరావు, ఇండియన్ బ్యాంక్, కెనరాబ్యాంక్ కో-ఆర్డినేటర్లు, శాస్త్రి, బాలాజీ పాల్గొన్నారు.

స్పందనలో అర్జీలు పరిష్కరించాలి : కలెక్టర్ డిల్లీరావు

స్పందనలో నమోదైన అర్జీలకు నిర్దేశించిన గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్, జేసీ ఎస్.నుపూర్ అజయ్, డీఆర్వో కే.మోహన్‌కుమార్‌లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. గడువు తీరిన అర్జీలు పెండింగ్ ఉండరాదని, ఆఫ్ లైన్, ఆన్ లైన్‌లో నమోదవుతున్న అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు దృష్టి పెట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, 1902 కాల్ సెంటర్, స్పందన మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్ ద్వారా అర్జీలు నమోదవుతుంటాయన్నారు. స్పందనలో ఒకసారి నమోదైన అర్జీ తిరిగి నమోదు కాకూడదని, స్పందనలోని ప్రతి ఫిర్యాధును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రజలకు సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. అర్హత ఉన్నప్పటికి సంక్షేమ పథకాలు అందకపోవడం, అన్యాయం జరిగిన సందర్భాల్లో ఫిర్యాధులు వస్తే విచారించి గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జే.సునీత, డీఎస్‌వో పీ.కోమలిపద్మ, ఐసీడీఎస్ పీడీ జీ.ఉమాదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీసీవో సీహెచ్.శైలజ, డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాసరావు, పశుసంర్థక శాఖ జేడీ కే.విద్యాసాగర్, గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కే.అనురాధ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి బాలాజీ కుమార్, హౌసింగ్ పీడీ శ్రీదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎం.విజయభారతి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : మేయర్ భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్పందనలో వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తెలిపిన సమస్యలపై అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. నగర పాలక సంస్థ ద్వారా ప్రజలకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల్లో ఎదురౌతున్న ఇబ్బందులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక-6, ఇంజనీరింగ్-3, రెవిన్యూ-2, ప్రజారోగ్య-1, యూసీడీ-2 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్‌లు ఎం.శ్యామల, కేవీ.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ డీ.వెంకటలక్ష్మి, సిటీ ప్లానర్ ప్రసాద్, ఎస్.ఇ నరసింహమూర్తి, యూసీడీ పీవో శకుంతల, మేనేజర్ బీ.శ్రీనివాస్‌రావు, పాల్గొన్నారు.

చింతలపూడికి డాక్టరేట్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరానికి చెందిన చింతలపూడి వెంకటేశ్వరరావుకు ఢిల్లీలో గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్ డాక్టర్ సీపీ.యాదవ్, వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ జర్నాస్ ప్రెసిడెంట్ అనుపమ త్రిగునాయత్ చేతుల మీదుగా సోమవారం ఈ గౌరవ డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చింతలపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తన కుటుంబం మొత్తం ఆయుర్వేదిక వైద్యులుగా, గ్రామీణ వైద్యులుగా ప్రజలకు సేవలు అందిస్తున్నామని, అదే కోవకు చెందిన తానుకూడా గత 25 ఏళ్ళు నుంచి ప్రజలకు వైద్యాన్ని అందిస్తూ అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ చెన్నుపాటి విద్య స్థాపించిన ఫౌండేషన్‌లో సభ్యునిగా కొనసాగుతూ తన వంతుగా తన సంపాదన నుంచి కొంత మొత్తాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ సమరంతో అనేక మెడికల్ క్యాంపుల్లో పాల్గొని ఈ క్యాంపులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో, నాకో ఫౌండేషన్ హైదరాబాద్ రవీంద్రభారతిలో సేవా దృక్పథం సర్టిఫికెట్లు కూడా తనకు అందజేయడం జరిగిందని, ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ నుండి కూడా తనకు గతంలో సర్టిఫికెట్ ఇవ్వడం జరిగిందని చెప్పారు. వృద్ధులకు, అనాధలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా సేవా కార్యక్రమాలకు గుర్తుగా తనకు ఈ డాక్టరేట్‌ను మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోకా సమస్త హ్యూమన్ రైట్స్ ఏపీ సీఈవో డాక్టర్ కే.సురేష్, స్టేట్ జనరల్ సెక్రెటరీ జీ.మహేష్ నాయుడు, నెల్లూరు టౌన్ చైర్మన్ వినుకొండ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వీఎంసీ క్రీడలను విజయవంతం చేయాలి : మేయర్ భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉద్యోగుల మమధ్య ఈ నెల 17, 18, 19 తేదిల్లో వీఎంసీ స్పోర్ట్స్ మీట్-2023 నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే టీమ్‌లు ఎంపిక సోమవారం స్థానిక వీఎంసీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లో లాటరీ విదానంలో చేశారు. మేయర్ జట్టు, కమిషనర్ జట్టు, మున్సిపల్ రెవెన్యూ, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, టౌన్ ప్లానింగ్, యూసీడీ, ఎడ్యుకేషన్, రెవిన్యూ(వీ.ఆర్.ఓ), మహిళా పోలీస్ మొత్తం 10 టీమ్‌లు ఈ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

జరిగే పోటీల వివరాలు :

100, 400 మీటర్ల పరుగు, లాంగ్ జంప్, 400 మీటర్ల నడక, షార్ట్ పుట్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్, కబాడీ, టెన్నిస్, చెస్, త్రో బాల్, టెన్నీ కాయిట్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో జూనియర్, సీనియర్ స్త్రీ, పురుషుల విభాగాల మధ్య జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ స్పోర్ట్స్ మీట్-2023 అధికారులు డీఎఫ్ఓ శ్రీనివాస్, అదనపు కమిషనర్‌లు ఎం.శ్యామల, కేవీ.సత్యవతి, చీఫ్ ఇంజనీర్ ఎం.ప్రభాకరరావు, సిటి ప్లానర్ ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరస్ రాయ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పీ.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ డీ.వెంకటలక్ష్మి, పీవో శకుంతల ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ ధర్నాలో అపశృతి-కానిస్టేబుల్‌కు గాయాలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తోటచర్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఎంఆర్‌పీఎస్ నాయకులు రోడ్డు దిగ్బంధనం చేశారు. రహదారిపై ధర్నాకు దిగి పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో కొందరిని పోలీసులు అరెస్టుచేసే సమసయంలో పోలీసులపై రాళ్లు విసిరారు. ఈ ఘటనలో విజయవాడ కానిస్టేబుల్‌గా నందిగామ ట్రాఫిక్‌లో పనిచేసే తిరుమలరావుకు తలకు గాయమవంతో హుటాహుటీన నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వై ద్యం చేస్తున్నారు. ఈ చర్యకు పాల్పడిన వారిపై తగ్గ చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

రజాబ్ ప్రసాద సమారాధన

విశాలాంధ్ర-ఎ కొండూరు : చీమలపాడు గ్రామంలో బాబా వారి దర్గా ప్రాంగణంలో ఈ ఏడాది కూడా పవిత్ర రజాబ్ ప్రసాద సమారాధనను మంగళవారం నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత పీఠాధిపతి సజ్జద నషీన్ ఖాజా మొహియుద్దిన్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన స్థానిక పత్రిక విలేకరులతో మాట్లాడుతూ బాబావారు పరమపదించిన తరువాత జరుగుతున్న రెండో రజాబ్ ప్రసాద సమారాధన జరుగుతుందని ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు కూడా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఏడాది గడచినా...తీరని రోడ్డు సమస్య!

అధికారుల సమన్వయలోపం, తోడైన నిర్లక్ష్యదోరణి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట పంచాయతీలో ఎప్పటి నుంచో ఆక్రమణలో ఉన్న తమ ప్రాంతానికి చెందిన రహదారిని ఆక్రమణల చెర నుంచి విడిపించి, తమకు సదుపాయం కల్పించాలని రాజీవ్‌నగర్ గ్రామానికి చెందిన ప్రజలు కొన్ని సంవత్సరాలుగా ఎన్నిసార్లు కోరినా, సమస్య పరిష్కారం కాని దుస్థితి నెలకొంది. వివరాల్లోకి వెళితే...విస్సన్నపేట రాజీవ్‌నగర్ నుంచి విస్సన్నపేట శివాలయం వరకు గతంలో ఉన్న రహదారి ఆక్రమణలకు గురయ్యింది. ఈ మార్గం ప్రధాన గ్రామం నుంచి తమ ప్రాంతానికి వెళ్లేందుకు దగ్గరి దారి కావటమే కాక, మండలంలోని మిట్టగూడెం, తాతకుంట్ల తండా, మారేమండ తదితర గ్రామాల ప్రజలకు సదుపాయంగా ఉంటుందని గత నాలుగు సంవత్సరాలుగా మండలస్థాయి అధికారులు, నేతలను పలుమార్లు కోరారు. రాజీవ్‌నగర్‌వాసులంతా అభివృద్ధి కమిటీ పేరుతో ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని, మండలపరిషత్తు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా, మండలపరిషత్తు సర్వసభ్య సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ చర్చలో రహదారి ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ హామీ నెలలు గడచినా, అమలు కాకపోవటంతో స్థానిక శాసనసభ్యుడు కె.రక్షణనిధి దృష్టికి తీసుకెళ్లటంతోపాటు, అధికారులు నిర్వహించే స్పందనలో అర్జీ దాఖలు చేశారు. అయినా పని కాకపోవటంతో పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామంటూ పంచాయతీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో పంచాయతీ అధికారులు పాలకవర్గ సమావేశంలో తీర్మానించి, రహదారిని సర్వే చేయించి, తమకు అప్పగించాలని రెవిన్యూశాఖను కోరింది. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే రక్షణనిధి సైతం రహదారిని సర్వే చేయించాలని రెవిన్యూశాఖను ఆదేశించారు. రెవిన్యూశాఖ రహదారి సర్వేపై సర్వేశాఖను ఆదేశించింది. ఈ ఆదేశాలు గత ఏడాదిలోనే అందుకున్న సర్వేశాఖ అధికారులు మాత్రం జాప్యం చేస్తూనే ఉన్నారు. దీనిపై ఆయా శాఖల అధికారులను విచారించగా, రహదారిని సర్వే చేసి, అప్పగించాలని సంబంధిత నగదు రెవిన్యూశాఖకు తొమ్మిది మాసాల క్రితమే కోరామని పంచాయతీ కార్యనిర్వహణాధికారి బీఎస్ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తాము సర్వే చేయాలని సర్వేశాఖను గత ఏడాదిలోనే ఆదేశించామని తహశీల్దారు కె.లక్ష్మి తెలిపారు. రహదారిని సర్వే చేసి, చూపితే, అభివృద్ధి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఎం బి.అనూరాధ హామీ ఇచ్చారు. ఇక సర్వే నిర్వహించాల్సిన సంబంధిత శాఖ అధికారులు మాత్రం తమకు ఖాళీసమయమే లేదంటూ చెప్పటం గమనార్హం. సమస్య పరిష్కారానికి అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోకుంటే త్వరలో ఆందోళన చేపట్టనున్నామని రాజీవ్‌నగర్ ప్రాంత అభివృద్ధికమిటీ కార్యదర్శి శీలం శ్రీనివాసరావు హెచ్చరించారు.